క్లుప్తంగా

కరాటేతో ఆత్మరక్షణ



నారాయణపేట రూరల్: చిన్నతనంలోనే కరాటే శిక్షణ పొందితే జీవితంలో ఎవరికి వారు ఆత్మ రక్షణ పొందేందుకు ఎంతో ఉపకరిస్తుందని ఎస్పీ యోగేష్ గౌతమ్ అన్నారు. పట్టణంలోని కరాటే మాస్టర్ అశోక్ వద్ద నాలుగేళ్లుగా శిక్షణ పొందిన ఆరాధ్య, అభిలాష్, నితిన్, వరు ణ్‌లకు బుధవారం ఎస్పీ చేతుల మీదుగా బ్లాక్‌బెల్టులను ప్రధానం చేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. చదువుతోపాటు కరాటే నేర్చుకోవాలని, ప్రతి పాఠశాలలో విరామ సమయంలో శిక్షణ ఇవ్వాలని సూచించారు. తల్లిదండ్రులు సైతం కరాటే నేర్పించేందుకు ఆలోచించాలన్నారు.

వృథాగా తాగునీరు..



మరికల్: మండల కేంద్రంలో ఓ వాటర్ ట్యాంకర్ అపరిశుభ్రతపై కాలనీ వాసులు పలు మార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. కలుషిత నీరు తాగడంతో అంటు వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ట్యాంక్‌ను శుభ్రపర్చాలని, అలాగే వృథా నీటిని అరికట్టాలని కాలనీవాసులు కార్యదర్శిని కోరుతున్నారు.

ఎంపీడీఓగా శ్రీనివాసులు

నర్వ: మండల ఎంపీడీఓగా శ్రీనివాసులు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గత కొన్నిరోజులుగా రెగ్యులర్ ఎంపీడీఓ లేక పోవడంతో ఇన్‌చార్జి ఎంపీడీఓగా ప్రస్తుత ఎంపీఓ సుదర్శన్ విధులు నిర్వహిస్తున్నారు. బదిలీపై నారాయణపేట నుంచి నర్వకు వచ్చిన శ్రీనివాసులు రెగ్యులర్ ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానన్నారు.

కొనసాగుతున్న నల్లా కనెక్షన్ సర్వే



మక్తల్: మిషన్ భగీరథ పథకం ద్వారా గ్రామాల్లో అమలవుతున్న తాగునీటి సరఫరా సమగ్ర వివరాల సేకరణకోసం చేపట్టిన సర్వే మండలంలో కొనసాగుతోంది. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు ఇంటింటికీ తిరిగి తాగునీరు అందుతోందా? ఇంకా తాగునీటి సరఫరాలో ఎలాంటి సమస్యలున్నాయనే ప్రాతిపాదికన ప్రత్యేక యాప్‌లో నమోదు చేపడుతున్నారు.

రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శిని నియమించాలి

నారాయణపేట రూరల్: మండలంలోని కోటకొండకు రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శిని నియమించాలని పీవైఎల్ జిల్లా నాయకులు ఎండీ సలీం డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టరేట్, డీపీఓ కార్యాలయాల్లో వినతిపత్రం అందించి మాట్లాడారు. వర్షాకాలం సీజన్ ప్రారంభం కావడంతో అంటువ్యాధులు సోకే ప్రమాదం ఉందని, గ్రామంలో పరిశుభ్రత, ఇతర పనులు చేపట్టడానికి రెగ్యూలర్ పంచాయతీ కార్యదర్శి ఉండాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు.

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు

మక్తల్: పట్టణంలో అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే సహకారంతో తాగునీటి బోరును వేయించారు. నీరు పుష్కలంగా రావడంతో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చంద్రకాంత్‌గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గణేష్‌కుమార్, అశోక్‌గౌడ్, అనిల్, ఆంజనేయులు, శ్రీధర్‌గౌడ్ పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్‌తో కోతి మృతి

మాగనూర్: మండల కేంద్రంలోని బస్టాండ్ చౌరస్తాలో విద్యుత్‌షాక్‌తో కోతి మృతి చెందిన ఘటన బుధవారం ఉదయం చోటు చేసుకుంది. బుధవారం ఉదయం ఆహారం కోసం గ్రామంలోకి కోతులు రావడంతో హైటెన్షన్ వైర్లు తగిలి ఓ కోతి మృతి చెందింది. దీంతో గ్రామస్తులు ఆ కోతికి హిందూ సాంప్రదాయ బద్ధంగా పూజలు నిర్వహించి స్థానికంగా ఉన్న పెద్ద వాగులో పూడ్చిపెట్టారు.

ఎల్‌ఓసీ అందజేత

దామరగిద్ద: మండలంలోని సృజనాపూర్ గ్రామానికి చెందిన షేర్‌ఖాన్ గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతుండగా మెరుగైన వైద్యంకోసం నీమ్స్ ఆస్పత్రిలో చికిత్స కోసం రూ. లక్ష ఎల్‌ఓసీని ఎమ్మెల్యే పర్ణికారెడ్డి బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ మేరకు.. బాధితకుటుంబ సభ్యులు, సీపీఎం మండల కార్యదర్శి ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిజేశారు.



పేటలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న కౌన్సిలర్ సలీం



కృష్ణాలో..



నిడ్జింతలో..

ప్రభుత్వ బడుల్లో మెరుగైన విద్య



దామరగిద్దలో పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

మరికల్: ప్రభుత్వ పాఠశాల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని ఎమ్మెల్యే పర్ణికారెడ్డి అన్నారు. బడిబాటలో భాగంగా బుధవారం మండలంలోని బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థుల సమస్యలు, పాఠశాల యొక్క మౌలిక వసతులపై తనతో నేరుగా మాట్లాడి సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థి మెరుగైన ఫలితాలను సాధించేందుకు ఉపాధ్యాయులు చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. అలాగే మండలంలోని అన్ని గ్రామాల్లో జెడ్పీ చైర్మన్ సురేఖ, ఎంపీపీ శ్రీకళ పర్యటించి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో విద్యార్థులు మంచిగా చదువుకోవాలని వారు సూచించారు. అదేవిధంగా పాఠశాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించేందుకు ఎమ్మెల్యేలు చర్యలు చేపట్టాలని కోరారు. ఆయా కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ సురేఖ, ఎంపీపీ శ్రీకళ, ఎంపీటీసీ గోపాల్, ప్రత్యేక అధికారి నరేందర్, హెచ్‌ఎం మనోరంజిని, నాయకులు సూర్యమోహన్, కృష్ణయ్య, హరీష్, రామకృష్ణ, ఆంజనేయులు, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

దామరగిద్ద: ప్రభుత్వ బడుల్లో అందిస్తున్న సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని కాన్‌కుర్తి జెడ్పీ ఉన్నత, సీపీఎస్, జీపీఎస్ పాఠశాలల్లో విద్యార్థులకు దుస్తులు, పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విశ్వనాథ్, ఎంపీటీసీ బస్వరాజ్, ఎంపీడీఓ శ్రీధర్, సుదర్శర్‌రెడ్డి, ఉపాధ్యాయులు ఎస్. విశ్వనాథ్, సునిత, శివరాజ్, సంతోష్ పాల్గొన్నారు.

నారాయణపేట: పట్టణంలోని ఏడోవార్డ్ పరిధిలోని బుధవారం అశోక్‌నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు వార్డు కౌన్సిలర్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఎండీ సలీం యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలల్లో తమ పిల్లలను చదివించకుండా, ప్రభుత్వ పాఠశాలలో చదివించి తమ పిల్లల బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రావణి, ఉపాధ్యాయురాలు మౌనిక, వార్డ్ ఆఫీసర్ మహమ్మద్ ఖుద్దూస్, అంగన్‌వాడీ టీచర్ శివలీల, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్, సభ్యులు పాల్గొన్నారు.

ధన్వాడ: మండల కేంద్రంలోని సంతబజార్ పాఠశాలలో బుధవారం విద్యార్థులకు యునిఫాం, పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ మేరకు.. ముఖ్యఅతిథిగా డీఆర్‌డీఓ రాజేశ్వరి పాల్గొని మాట్లాడారు.. తల్లితండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని, నాణ్యమైన విద్య, ఉచితపుస్తకాలు, దుస్తులు ప్రభుత్వ అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సాయిప్రకాష్, ఆప్ కమిటీ చైర్మన్ రేణుక, ఎంపీటీసీ మాధవి, హెచ్‌ఎం రమేష్‌శెట్టి, బాలరాజు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రావు, సుల్తానా, తాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

మాగనూర్: మండల పరిధిలోని ఆయా ప్రభుత్వ పాఠశాలలో బుధవారం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వడ్వాట్ పాఠశాలలో దుస్తుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నా జెడ్పీటీసీ వెంకటయ్య, ఎంపీపీ శ్యామలమ్మ మాట్లాడుతూ.. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని చక్కగా చదువుకొని జీవితం ఉన్నతస్థాయికి చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్, వైస్‌ఎంపీపీ తిప్పయ్య, ఇన్‌చార్జి ఎంపీడీఓ జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా: ప్రభుత్వం నుంచి అన్ని సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని ఎంపీడీఓ జానయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమికోన్నత, హిందూపూర్‌లోని ప్రాథమి కోన్నత పాఠశాలల విద్యార్థులకు యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు ఆ పాఠశాలల హెచ్‌ఎంలు మీరా, అజయ్‌లతో కలిసి పంపిణీ చేశారు. వైస్ ఎంపీపీ ఈశ్వరప్పగౌడ, నాయకులు శివరాజ్‌పాటిల్, ఉపాధ్యాయులు వినోద్‌కుమార్, నాగరాజు, ఎంపీఓ రామన్న పాల్గొన్నారు.

మద్దూరు: తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నర్సింహ సూచించారు. బుధవారం మండలంలోని నిడ్జింత, రెనివట్ల పాఠశాలల్లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, దుస్తులు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలను అమ్మ ఆదర్శ పాఠశాలలు ఈ ప్రభుత్వం తీర్చి దిద్దుతోందని, పాఠశాలపై పర్యవేక్షణ బాధ్యత విద్యార్థుల తల్లులకే అప్పగించిందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జయరాములు, ఐకేపీ ఏపీఎం నారాయణ, ఎంపీటీసీలు కాంతరెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, విజయ్, అశోక్, గోవిందు పాల్గొన్నారు.

ఊట్కూరు: బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని ఎంపీడీఓ ధనుంజయ్యగౌడ్ అన్నారు. బుధవారం మండలంలోని నిడుగుర్తి పాఠశాలలో విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు గ్రామంలోని యువకులు, విద్యార్థుల తల్లిదండ్రులు కృషిచేయాలన్నారు. అలాగే చిన్నపొర్ల,మల్లేపల్లి, పులిమామిడి, పగిడిమారి, కొల్లూరు తదితర పాఠశాలలో విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం లక్ష్మారెడ్డి, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం సురేష్, ఎంపీటీసీ రాఘవరెడ్డి, ఏపీఎం నిర్మల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



పుస్తకాలు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు

కోస్గి: ప్రభుత్వ పాఠశాల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని జెడ్పీటీసీ ప్రకాష్‌రెడ్డి, ఎంపీపీ మధుకర్ రావు అన్నారు. ఈ మేరకు బుధవారం గుండుమాల్ మండల పరిధిలోని బోగారం జెడ్పీ ఉన్నత పాఠశాలతో విద్యార్థులకు బడి బాటలో భాగంగా ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలు, యూనిఫాం పంపిణీ చేశారు. అలాగే స్థానిక గాంధీ స్మారక పాఠశాలలో కౌన్సిలర్లు బెజ్జు సంగీత, బాలేష్ విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, ఏకరూప దుస్తులు, ఇతర సామగ్రి పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీడీఓ సాయి లక్ష్మీ, పాఠశాల హెచ్‌ఎంలు సత్యనారాయణ, గిరిజ, ఏఏపీసీ చైర్మన్ వెంకటయ్య, రిటైర్డ్ హెచ్‌ఎం గురునాథ్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ శశిధర్, కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు బెజ్జు రాములు పాల్గొన్నారు.



ధన్వాడలో..



నిడుగుర్తిలో ..



నేరడగంలో..

బడి గంట మోగింది..


నారాయణపేట రూరల్: విద్యాసంవత్సరం ప్రారంభంలో పాఠశాలలన్ని తెరుచుకున్నాయి. కాని విద్యార్థుల సంఖ్య మాత్రం అంతంతే ఉంది. బుధవారం తొలిరోజు జిల్లాలో 58,800మందికి గాను 12600 మంది విద్యార్థులు పాఠశాలకు రాగా, కేవలం 21శాతం మాత్రమే హాజరు నమోదైంది. అయితే వీరికి పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలు, యూనిఫామ్స్ పంపిణీ చేపట్టారు. కనీసం శుభ్రం చేసేందుకు స్కావింజర్లు సైతం అందుబాటులో లేకపోవడంతో పంచాయతీ కార్మికులతో మమ అనిపించారు. టీచర్ల కొరతతోపాటు సరిపడా గదులు లేక భవిష్యత్‌లో ఇబ్బందులు తప్పేలా లేదు.

మక్తల్: మండల కేంద్రంలో బుధవారం పాఠశాలల ప్రారంభం మొదటి రోజు విద్యార్థుల సంఖ్య చాలా తగ్గింది. బడిబాట కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విద్యార్థులకు ఇంకా యూనిఫాంలు, పుస్తకాలు పంపిణీరోజు సరఫరా చేపట్టలేదు.


మాగనూర్: పాఠశాలలు పున:ప్రారంభమైన నేపథ్యంలో బుధవారం మండలంలోని మండల పరిషత్ పాఠశాల విద్యార్థులకు ఉపాధ్యాయులు ఘన స్వాగతం పలికారు. ఈ మేరకు.. పాఠశాల హెచ్‌ఎం స్వప్న మాట్లాడుతూ.. విద్యార్థులు ఈ విద్యా సంవత్సరంను గొప్పగా ప్రారంభించాలని కోరారు.



పేటలో విద్యార్థులను స్వాగతం పలికి పుస్తకాలు, దుస్తులు అందిస్తున్న ఉపాధ్యాయులు



మక్తల్‌లో..



మాగనూర్‌లో..

డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా నారాయణగౌడ్



నారాయణపేటరూరల్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా నారాయణగౌడ్ నియమితులయ్యారు. సూర్యలక్ష్మి డిగ్రీ కళాశాల గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ పరం అయ్యాక చిట్టెం నర్సిరెడ్డి మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలగా మార్పు చేశారు. ఈ క్రమంలో 2022 ఆగస్టు 25న ఇదే కళాశాలలో పనిచేస్తున్న సీనియర్ అధ్యాపకులు రంగారెడ్డిని ప్రిన్సిపాల్‌గా నియమించారు. నాటి నుంచి నేటివరకు కొనసాగిన ఆయన అనారోగ్య కారణాలతో బాధ్యతల నుంచి వైదొలిగారు. ఈ మేరకు ఆయన తదుపరి సీనియర్‌గా ఉన్న భౌతికశాస్త్రం అధ్యాపకులు నారాయణగౌడ్ ప్రస్తుతం కళాశాలలో పరీక్షల విభాగం అధికారిగా కొనసాగుతున్నారు. ఆయనకు ఎఫ్‌ఏసీ ప్రిన్సిపాల్ బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు వెలుబడ్డాయి. దీంతో బుధవారం ఆయన రంగారెడ్డి సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు. కళాశాల అధ్యాపకులు శాలువాతో సన్మానించి అభినందించారు.

బాలల హక్కులపై అవగాహన

ఊట్కూరు: మండలంలోని పగిడిమారిలో బుధవారం ప్రపంచ బాలకార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని బాలల రక్షణ విభాగం వారు ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు.. జిల్లా కార్మికశాఖ అధికారి రాజుకుమార్ మాట్లాడుతూ.. బాలలను పనిలో పెట్టుకోవద్దని, ఎవరైన పనిలో పెట్టుకుంటే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలని నేటిబాలలే రేపటి పౌరులని తెలిపారు. కార్యక్రమంలో సీపీఓ తిరుపతయ్య, నర్సింహులు, రాజు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఎమ్మెల్యేకు వినతి

దామరగిద్ద: తెలంగాణ ఉద్యమంలో పాల్గొని మృతిచెందిన క్యాతన్‌పల్లికి చెందిన గౌస్మియా కుటుంబాన్ని ప్రభుత్వం గుర్తించి ఆదుకోవాలని సీపీఎం జిల్లా నాయకుడు గోపాల్ బుధవారం ఎమ్మెల్యే పర్ణికారెడ్డికి వినతిపత్రం అందజేశారు.

సంగంబండ కుడి లోలెవల్ కెనాల్ పరిశీలన

మాగనూర్: సంగంబండ కుడి లోలెవల్ కెనాల్‌ను మండల కాంగ్రెస్ వడ్వాట్ రవీందర్ ఆధ్వర్యంలో సంగంబండ శివారులో పరిశీలించారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడుతూ.. సంగంబండ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ పూర్తయి సంవత్సరాలు గడుస్తున్న కుడి లోలెవల్ కెనాల్ పనులు పూర్తి కాకపోవడంతో రైతులు ఇబ్బందులు అనేకమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన ఆరు నెలలలోపే సంగంబండ గ్రామ సమీపంలో ఉన్న బండరాయిని తొలగించి కెనాల్‌కు నీరు అందించేందుకు సిద్ధం కావడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి రైతుల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.



కెనాల్‌ను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

బురదమయంగా ఎమ్మార్సీ భవనం

ధన్వాడ: మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనం వద్ద నీరు నిలిచి బురదమయంగా మారిందని మండల విద్యాశాఖ అధికారి అంజలిదేవి అన్నారు. పంచాయతీ అధికారులు పరిశీలించి కార్యాలయం ఎదుట మొరం వేయించాలని సూచించారు.



ప్రభుత్వ కళాశాలలో నాణ్యమైన విద్య

నారాయణపేట రూరల్: ప్రభుత్వ కళాశాలలో నాణ్యమైన విద్య లభిస్తుందని అధ్యాపకులు అన్నారు. జిల్లా కేంద్రంలోని జీజేసీ కళాశాల బోధన సిబ్బంది బుధవారం మండలంలోని తిర్మలాపూర్, కోటకొండలో కరపత్రాలు అందించి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పదోతరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడుతూ.. ఎలాంటి ఫీజు లేకుండా చక్కటి విద్య ప్రభుత్వ కళాశాలలో దొరుకుతుందని, ప్రైవేట్ దోపిడి నుంచి తప్పించుకోవాలన్నారు. స్థానికంగా ఉంటూ చదువుకోవాలన్నారు. కార్యక్రమంలో రవీందర్, నర్సింహారెడ్డి, కృష్ణ, రాజు, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు అందిస్తున్న అధ్యాపకులు

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

నర్వ: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెడ్‌కానిస్టేబుల్ చందర్ నాయక్ అన్నారు. బుధవారం ఎల్లంపల్లిలో పోలీస్ కళాజాత బృందంచే అవగాహన నిర్వహించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ.. వాహనాలు నడిపేటప్పుడు తప్పకుండా ట్రాఫిక్‌రూల్స్‌ను పాటించాలన్నారు. గ్రామాల్లో ప్రజల భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. బాలకార్మిక వ్యవస్థను రూపుమాపాలన్నారు. కార్యక్రమంలో కళాజాత బృందం సభ్యులు ఆటలు, పాటల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాజాత బృందం సభ్యులు సురేందర్‌గౌడ్, శేఖర్, లింగన్న, కల్యాణి, రుక్యానాయక్, కానిస్టేబుల్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం

తైబజార్ వేలం వాయిదా

మద్దూరు: మండలంలోని ప్రతి గురువారం నిర్వహించే సంతబజారు, పశువుల సంత వేలం వాయిదా పడింది. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కోడ్ దృష్ట్యా మార్చిలో నిర్వహించాల్సి వేలంను ఈ నెల 12న నిర్వంహిచడానికి అన్నిఏర్పాటు చేశారు. 37మంది వేలం పాటలో పాల్గొనడానికి డబ్బులు చెల్లించారు. గ్రామ పంచాయతీ ఆవరణలో నిర్వహించాల్సిన వేలంలో గ్రామస్తులు వేలం పాటదారులు 3 నెలల కాలానికి డబ్బులు తగ్గించి వేలం పాట నిర్వహిస్తున్న క్రమంలో ఇంకా డబ్బులు తగ్గించాలని వేలం పాటదారులు అధికారులపై ఒత్తిడి తీసుకురావడంతో ఎంపీఓ విజయలక్ష్మి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వేలం పాట ధర నిర్ణయించారు. దీనిపై వేలంపాటదారులకు అభ్యంతరం ఉంటే వేలాన్ని వాయిదా వేస్తామని ఆమె సూచించారు. దీంతో వేలాన్ని వాయిదా వేశారు. పంచాయతీ కార్యదర్శి రామునాయక్, గ్రామస్తులు, వేలం పాటదారులు పాల్గొన్నారు.

విత్తనాల కొనుగోలుపై అవగాహన

మాగనూర్: రైతులు వానాకాలం పంటలకు సిద్ధమవుతున్న నేపథ్యంలో వ్యవసాయ పనుల్లో జాగ్రత్తలు పాటించాలని కొల్పూర్ ఏఈఓ రాధిక అన్నారు. బుధవారం ఆమె మండల పరిధిలోని కొల్పూర్‌లో రైతులకు విత్తనాలు కొనుగోలుపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులు వరి వంగడాల పద్ధతి, వరి కొయ్యలను, పంట వ్యర్థాలను ఎట్టి పరిస్థితులలో కాల్చొద్దని తెలిపారు. నేలలో దున్నడంతో నేల సారవంతమవుతుందని వివరించారు. అనంతరం జీలుగు, పచ్చిరొట్ట పెంపకం గురించి వివరించారు. వ్యవసాయ పనుల్లో రైతులు తప్పకుండా వ్యవసాయ అధికారులను సంప్రదించి వారి సలహాలు, సూచనలు పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ రైతులు, తదితరులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఈఓ

పద్మశాలీలు ఆర్థికంగా ఎదగాలి

ధన్వాడ: పద్మశాలీలు ఆర్థికంగా ఎదగి తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని పద్మశాలి సంఘం రాష్ట్ర కార్యదర్శి ఉదయభాను అన్నారు. బుధవారం స్థానిక శ్రీ భక్త మర్కండేయ స్వామి ఆలయంలో ధన్వాడు చెందిన బోగం సాయి ప్రియ నేషనల్ ఎలిజీబిలీటీ కామన్ ఎంట్రెన్స్‌లో 720గాను 535 మార్కులు సాధించడంపై సంఘం తరుపున విద్యార్థిని వారి తల్లిదండ్రులను శాలువాతో సన్మానించారు. అలాగే నూతనంగా ఎన్నికైన పద్మశాలి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాకం సురేందర్, బోర్ల శివాజీ, యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి విరేష్‌కుమార్‌ను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం దృష్టి సారించి పద్మశాలీలకు సబ్సిడీపై రుణాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు బాల్‌రాజు, బాలప్ప, వెంకటేష్, వెంకట్రాములు, శ్రీనివాసులు, నరేందర్, గండిబాలరాజు, రంగయ్య, నారాయణ, బాలయ్య, కృష్ణయ్య, రాఘవేందర్, రాము, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్ర కార్యదర్శి విరేష్‌కుమార్‌ను సన్మానిస్తున్న నాయకులు

అండర్ డ్రైయినేజీ నిర్మించండి

అమరచింత: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వెనక నుంచి మాల వీధి వరకు ఉన్న పెద్ద చెరువు కాల్వ ద్వారా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, దోమలతో రోగాల బారిన పడుతున్నారని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఉన్న చెరువు కాల్వను తొలగించి వాటి స్థానంలో అండర్ డ్రెయినేజీని నిర్మించాలని కోరుతూ బుధవారం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. చెరువు నీరు వెళ్లడం కోసం అప్పట్లో కాల్వను నిర్మించారని, ప్రస్తుతం అదే కాల్వలో ఇళ్ల నుంచి వస్తున్న మురుగు పారుతుండడంతో కాల్వ పరిసరాలు దుర్గంధంగా తయారయ్యాయని తెలిపారు. కాల్వ తెరుచుకొని ఉండటంతో చిన్నారులు, వృద్ధులు కాల్వలో పడి ప్రమాదాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తమ సమస్యను పరిష్కరించే విధంగా అండర్ డ్రెయినేజీని నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో రాజన్న, నారాయణ, మహేందర్, రాంచందర్, నాగప్ప, కుమ్మరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న కాలనీవాసులు

అద్దెకు వ్యవసాయ పరికరాలు

ఆత్మకూర్: మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో వ్యవసాయానికి అవసరమైన పనిముట్లు తక్కువ కిరాయితో అద్దెకు అందుబాటులో ఉన్నాయని, రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వెలుగు సిబ్బంది అన్నారు. రెండు ట్రాక్టర్ ఇంజన్లు, గుంటుక, నాలుగు కల్లి వేటర్లు, కేజ్‌వీల్స్ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వివరాలకు 94936 91275, 87909 90783, నంబర్లకు సంప్రదించాలని కోరారు.